# మినీ కథ

## ఉత్తరా లొస్తున్నాయ్!

**యర్రమిల్లి జె. శేఖరం (కాకినాడ)**

నిద్రలో ఓ ప్రక్క నుంచి మరో పక్కకి దొర్లాడు రమణ. కళ్ళుమూసుకునే చెయ్యి జాపి భార్యకోసం పక్కమీద వెదికాడు. ఆమె ప్రక్కనే లేకపోయేసరికి కళ్ళు తెరిచి చూసాడు.

బల్ల దగ్గరకుర్చీ వేసుకుని టేబుల్‌లైట్ వెలుగులో, తలవంచుకొని ఏదో దీక్షగారాసేస్తోంది రేణుక. 'కొంపదీసి కథలు గట్రా రాయడంలేదు గదా మళ్ళా' అని సందేహం కలిగి నవ్వుకున్నాడు.

ఆమె నుదిటిమీద స్వేదబిందువులు మెరుస్తున్నాయి. ముంగురులు తడిసి నుదుటికి అంటుకుని, ఫేనుగాలికి విడుదలకోసం అల్లల్లాడుతున్నాయి.

అతడికి అమాంతం ఆమె ముంగురులు సవరించా లనిపించింది. చప్పుడవకుండా లేచి ఆమెకు తెలియకుండా వెనుకనుంచి దగ్గరగా వెళ్ళాడు.

రేణుక ఇన్‌లాండ్ కవరు మడతపెట్టి పైన చిరునామారాస్తోంది. అక్షరాలు దిద్దినట్టు ఏకాగ్రతగా:

టు మిస్టర్ సంపత్, మేంమాసి వీధి. మధురై-625001.

టు మిస్టర్ సంపత్?

రమణ ఆలోచించాడు- రేణుకచిన్నాన్న కొడుకా, పెదనాన్నగారబ్బాయా? ఎవరు? ఎవరు?

రేణుకకి పెళ్ళికాకపుందు బోయ్ ఫ్రెండా?

చటుక్కున గుర్తుకు వచ్చిందతనికి. తన పెళ్ళిలో ఎవరో తనకి ఫోన్‌చేసి రేణుక నడవడిక గురించి నచ్చచెప్పడానికి ప్రయత్నించడం తను మొదట కొంత ఊగులాడినా, తరువాత పెడచెవిన పెట్టడం-

అతని తలలో డైనమైట్ పేలింది.

నిశ్శబ్దంగా వెళ్ళిమంచం మీద పడుకున్నాడు.

వ్రాయడం ముగించిన రేణుక, తల వెనక్కి తిప్పి భుజంమీదనుంచి అతనివంక చూసింది.

రమణ నిద్ర నటించాడు.

చప్పుడు చెయ్యకుండా లేచి, వ్రాసిన కవరు బల్లడ్రాయరులో పెట్టి తాళంవేసింది.

తాళంచెవి తీసుకువెళ్ళి భద్రంగా దేముడి పటం వెనుకగాదాచింది. అలాదాసూ ఓరగా రమణ పడుకున్న దిశగా, అలికిడికి లేస్తాడేమోనని భయపడుతున్నటుగా చూసింది. మూసిన కనురెప్పల క్రిందనుంచిచూస్తున్న రమణ కోపంతో లోలోపలే మరిగిపోయాడు.

వ్రాసిన కవరు బల్లసొరుగులో పెట్టడం, తాళంవెయ్యడం, తాళం చెవి తీసుకు వెళ్ళి తను చూస్తున్నాడేమోనని భయపడుతూ దాచడం...

ఏమిటిదంతా?

పది నిముషాల తరువాత ఆమె నిద్రపోయింది. అతను మేలుకునే ఉన్నాడు. మనసంతా గందర గోళంగాఅయిపోయింది. అశాంతిగా అటూ యిటూదొర్లాడు. చివరకు ఒక నిశ్చయానికి వచ్చి లేచి పెన్‌టార్చ్ తీసుకుని, చప్పుడుచెయ్యకుండా కదిలాడు.

రేణుకకి తెలియకుండా ఆ ఉత్తరం చదవాలి. చదివి ఆ సంపత్‌గాడెవడో తెలుసుకుని వాళ్ళిద్దర్నీ......

అతడు రాక్షసుడే అయ్యాడు.

దేముడి వెనుక తాళం చెవి తీసాడు.

మేజా సొరుగు లాగుతుంటే'క్రు'మని చప్పుడయింది.

అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది.

పెన్‌టార్చ్ సొరుగులోకి వేసాడు.

'మరణ గర్జన' ప్రఖ్యాత నవల, ఎర్రటి అట్టమీద తెల్లటి పుర్రె బొమ్మ.

పుస్తకం క్రిందుగా చక్కగా మడత పెట్టిన కవరు.



## జాగ్రత్త

కవరు విప్పుతుంటే అతని చేతులు వణికాయి.

'ప్రియమైన......'

గదిలో ట్యూబ్‌లైట్ కాంతి 'టిక్' మని శబ్దం చేస్తూ పరుచుకుంది.

రమణ ఉలిక్కి పడి తల ఎత్తాడు.

ఎదురుగా చేతులు కట్టుకొని నిలుచుని ఉంది రేణుక. ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి. పచ్చి డ్రాయర్‌లో చేతులు పెట్టి పెద్ద ఇన్‌లాండు కవర్ల కట్ట తీసి అతని ముందు పడేసింది.

హౌ డేర్ షి యిస్! కోపంతో రమణ తల్లో నరాలు చిట్లిపోతున్నాయి.

అయినా కవర్లు చేతులోకి తీసుకొని చూసాడు.

ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయాయి.

ఒక్కొక్క కవరు మీద ఒక్కొక్క పేరు:సంపత్, సంగీత్, మదన్ మాధవ్ ......ఇలా!

చేతిలో తెరిచి పట్టుకున్న ఉత్తరంలోని అక్షరాల వెంట అతని కళ్ళు పరుగులు పెట్టాయి.

"వెంకటేశ్వరుని లీలల గురించి నాకో ఉత్తరం వచ్చింది. అది చదివిన వాళ్ళు, చూసిన వాళ్ళు అదే మాటర్‌ని వందమందికి ఉత్తరాలు వ్రాయాలి. ఆ ఉత్తరాలు అందుకున్న ఒక్కొక్కళ్ళు వందేసి మందికి మళ్ళీ ఉత్తరాలు వ్రాయాలి. ఒకే! మళ్ళీ తిరిగి నాకే వ్రాసే మహాను భావులుకొందరున్నారు. అందుకని పెన్ ఫ్రెండ్స్ కోసం పత్రికలలో పేర్లిచ్చేవాళ్ళ ఎడ్రసులకి రాస్తున్నాను. మీరూ రేపు ఒక నూరు ఇన్‌లాండు కవర్లు కొని వ్రాయండి" అంది రేణుక.

రమణ గుటకలు మింగాడు, "నేనా! ఎందుకు?"

"మీరు చదివి వగా. అందుకు! లేకపోతే ఆ దేవుడికి ఆగ్రహం వస్తుంది తెలుసాండి" అన్నది.

## మినీ కథ

# పదహారేళ్ళ అమ్మాయి

చంద్రం ఆ అమ్మాయిని చూడటం అది రెండోసారి: బస్సు దిగిన వెంటనే చూశాడు. విచిత్రచూపులు చూస్తూ నిల్చొనుంది ఆ అమ్మాయి! పదహారేళ్ళుంటాయేమో. అమాయకత్వం మొహంమీద కొట్టొచ్చినట్లు కనపడుతోంది. లేత బుగ్గలు, ఎర్రని పెదవులు, నిమ్నోన్నత శిఖరాలు, సన్నటి నడుం, పొడవైన కాళ్ళు అన్నీ వెరసి ఏ గ్రీకు శిల్పంలానో ఉంది.

సిగరెట్ వెలిగించుకుంటూ మరోసారి చూశాడు చంద్రం. ఆ అమ్మాయి ఒంటరిగా ఉందనే ధైర్యంతో ఇద్దరు రోమియోలు వెకిలిచేష్టలు ప్రారంభించారు. అలా అని చంద్రం అపరప్రవరాఖ్యుడేం కాదు. చంద్రంకు పిట్టల వేటంటే చాలా ఇష్టం. పిట్టలంటే మామూలు పట్టణాల్లో కన్పించేవే కాక పల్లెటూరివి అయితే మరీ ఇష్టం!

ఇపుడా అమ్మాయిని రూమ్‌కు తీస్కెళ్ళాలనే కోరిక క్షణ క్షణానికి బలమై కాళ్ళను కట్టేసింది.

ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుగా ఉందా అమ్మాయి. ఎంతకీ కదలకపోవడంతో రోమియోలు మరింతధైర్యంతో ఆమెను తాకుతూ నిల్చోవడానికి విజృంభించేరు. అయితే చంద్రం మెల్లగా వెళ్ళి ఆమె ప్రక్కన్నే నిల్చునేసరికి తమ విజృంభణను విరమించుకొని తమదారిన వెళ్ళిపోయారు రోమియోలు.

"ఏ ఊరునుండొచ్చావమ్మాయి?" అడిగాడు చంద్రం.

"బెజవాడనుండండి" భయం భయంగా చెప్పింది.

"ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టున్నావు?" చొరవగా అడిగాడు.

"మా బాబాయికోసమండి. ఇంకా రాలేదు." చెప్పింది ఆ పదహారేళ్ళ అమ్మాయి.

ఇంకో అరగంట అలా మాట్లాడుతూనే గడిపాడు చంద్రం. "చూడు అమ్మాయి! నేను నా రూమ్‌కెళ్తున్నాను. నీవూ నాతో పాటూ రా. రాత్రికి అక్కడే పడుకొని తెల్లవారేక మీ బాబాయిని కలుద్దువుగాని" వీలైనంత మృదువుగా చెప్పాడు చంద్రం.

"నమ్మింది. అమ్మయ్య! పదహారేళ్ళ పరువాలు ఈరోజు రాత్రి విందు!! ఎప్పుడూ రుచి చూడలేదు. ఎలాఉంటుందో! ఎప్పుడూ కేసులేగాని ఇలాంటి కంట్రీ బ్యూటీస్ దొరకలేదు" స్వగతంలో అనుకొన్నాడు చంద్రం.

* * *

స్వర్గం ఎలా ఉంటుందో ఆరాత్రి చూశాడు. మొదటి అనుభవమేమో చాలా భయపడిపోయిందా పదహారేళ్ళ అమ్మాయి. ఆ అమాయకమైన మొహం చూసాక ఓ పచ్చి నిజం చెప్పాలనిపించింది చంద్రానికి.

"చూడు అమ్మాయి, మరో తొమ్మిది నెలలు తరువాత నీకు కొడుకు పుడతాడు. వాడికి నా పేరెట్టుకో" చేతిలో వంద రూపాయలు పెడ్తూ అన్నాడు చంద్రం.

బట్టలన్నీ సర్దుకొని వెళ్తూ అందా అమ్మాయి. "నాకు కొడుకు పుట్టే సంగతలా ఉంచు. మరో తొమ్మిదిరోజులు పోయాక నీకు మచ్చలు లేస్తాయి. వాటికి సిఫిలిస్ అని పేరెట్టుకో" అన్నది ముసిముసిగా నవ్వుతూ.

– ఎ. ఎస్. రాజశేఖర్
(అనంతపురం)